# ఆ భూములు హెచ్‌సీయూవే..




కాంగ్రెస్ సర్కార్ చేసిన విధ్వంసం అంతా నిజమే
వేలాది చెట్లను కూల్చారు..
రాళ్లను తొలగించారు
సెంట్రల్ కమిటీ నివేదికలోని ప్రధాన అంశాలతో పోస్టర్ల విడుదల

సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం చెట్లను నరికేసిన 400 ఎకరాల భూములు న్యాయబద్ధంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకే చెందుతాయని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ నివేదికలో తేల్చిందని స్టూడెంట్ యూనియన్ వెల్లడించింది. ఆ భూముల్లో జరిగిన విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు సుప్రీం కోర్టుకు నివేదించిందని స్టూడెంట్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం కేంద్ర సాధికార కమిటీ నివేదికలోని ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. ఆ పోస్టర్లలోని అంశాల ప్రకారం... చారిత్రక రికార్డులు, న్యాయపరమైన ఆధారాల ప్రకారం 400 ఎకరాలతో పాటు హెచ్‌సీయూ పరిధిలో ఉన్న భూములన్నీ వర్సిటీకే చెందుతాయి. చట్టబద్ధమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను టీజీఐఐసీకి కట్టబెట్టింది. ఆ భూములపై హక్కులను టీజీఐఐసీకి బదాలయించడంలో అనేకమైన లోపాలుండటంతో పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ ముఖ్యమైన అంశాలను సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకోవాలని సీఈసీ విన్నవించింది. అడవిని తలపించేలా వృక్ష, జంతు సంపదను కలిగిన 400 ఎకరాల్లో జరిగిన విధ్వంసాన్ని అన్ని వర్గాల వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు, వైల్డ్ లైఫ్ ఎక్స్‌పర్ట్స్, ఎకాలజిస్టులు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ అధికారులు విధ్వంసంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రికార్డుల ప్రకారం

ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం అడవిగానే గుర్తించాలి. రాష్ట్రంలోని వివిధ శాఖల నుంచి సేకరించిన ఆధారాలు కూడా ఆ ప్రాంతం అడవిగానే తేల్చింది. ఆ భూముల్లో ఏండ్ల తరబడిగా ఉన్న రాళ్లు, వాటి నిర్మాణాలను పూర్తిగా ధ్వంసం చేయడం, వేలాది చెట్లు కూల్చడంతో వందలాది జీవుల ఆవాసాన్ని కొల్లగొట్టినట్లయింది. విద్యార్థులపై పోలీసుల తీరు న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉంది. వారిపై కూడా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సుప్రీంకు నివేదించింది.



నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 19 ఏప్రిల్ 2025 | HYDERABAD



రెడ్‌హిల్స్‌లో చెట్టుకూలడంతో కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్

***పొద్దంతా** ఎండతో సతమతమైన నగరాన్ని సాయంత్రం వేళ.. గాలివాన వణికించింది..ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు.. అతి తక్కువ వ్యవధిలోనే ఒక్కసారిగా వాన ఉరుములా విరుచుపడటంతో.. జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు చోట్ల ఈదురుగాలులు విధ్వంసమే సృష్టించాయి.. చెట్లు నేలకొరిగాయి.. తీగలు తెగి..విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.. ఓ చోట ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది..రోడ్లపైకి వరద నీరు పోటెత్తడంతో ఎక్కడికక్కడే..ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గంటల తరబడి వాహనదారులు నరకం చూశారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సహాయక చర్యల్లో జాప్యం కారణంగా ప్రజల కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. ఫీడర్లు ట్రిప్ కావడం..విద్యుత్ పునరుద్ధరణలో జాప్యం కారణంగా నగరవాసులు జాగారం చేయాల్సి వచ్చింది. బండ్లగూడలో 8.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.*

*- సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ)*


సచివాలయం రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్

# వాన బీభత్సం

| వర్షపాతం .. సెం.మీ లలో | |
|---|---|
| బండ్లగూడలో | 8.5 |
| బహదూర్‌పుర | 7.8 |
| చార్మినార్ | 7.6 |
| నాంపల్లి | 7.0 |
| చార్మినార్ | 6.6 |
| మలక్‌పేట | 6.6 |
| చాంద్రాయణగుట్ట | 6.1 |

## నగరం..నరకం..

- కూలిన భారీ వృక్షాలు
- విరిగిన విద్యుత్ స్తంభాలు
- పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్
- 441 ఫీడర్లు ట్రిప్
- కరెంటు సరఫరాకు అంతరాయం
- సహాయక చర్యలు..
- విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో జాప్యం
- రోడ్లపై నిలిచిన నీరు
- పలు చోట్ల ట్రాఫిక్ జామ్

ఆకస్మిక గాలివాన మహానగరాన్ని అతలాకుతలం చేసింది. భారీ వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఎండ, వేడితో నగర ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకునేలోపే.. గాలి వాన బీభత్సం సృష్టించింది. తీవ్రమైన ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి ఎక్కడికక్కడ చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం, కరెంటు అంతరాయం వల్ల నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్లపై కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. పలు చోట్ల ఈదురు గాలులతో పాటు వడగండ్ల వర్షం కురిసింది.


బీఆర్‌కే భవన్ వద్ద నేలకూలిన చెట్లు.. ధ్వంసమైన కార్లు


ఎంజే మార్కెట్‌లో కూలిన క్రేన్

### నేలకొరిగిన 48 చెట్లు..

ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో 48 చెట్లు నేలకొరిగాయి. వీటిని తొలగించేదిశగా అటు బల్దియా, హైడ్రా పనులు చేపట్టింది. చెట్లు కూలి విద్యుత్ స్తంభాలపై, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ తీగలపై పడడంతో చాలా చోట్ల గంటలకొద్దీ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఒకవైపు వర్షం, మరోవైపు కరెంట్ లేకపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే చిన్నచిన్న కారణాలతో సైతం సరఫరా నిలిపివేయడంతో నగరవాసులు విద్యుత్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం సాధారణ వర్షం పడినచోట సుమారు మూడునాలుగు గంటలు కరెంట్ నిలిపివేయడంతో ఎస్పీడీసీఎల్‌కు చాలా ఫిర్యాదులు వచ్చాయి. వర్షం కారణంగా కరెంట్ కోతలతో పలుప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్‌ను పురుద్ధరించడానికి సిబ్బంది ప్రయత్నాలు చేశారు. ఇంకా కొన్ని చోట్ల భారీ వృక్షాలు కూలిపోవడంతో విద్యుత్ పునరుద్ధరణకు కొంత సమయం పట్టే అవకాశమున్నట్లు అధికారులు చెప్పారు.

IVలో



# వారసత్వ కట్టడాలు తెలంగాణకు గర్వకారణం

**నగర వారసత్వ సంపదను కీర్తిస్తూ కేటీఆర్ ట్వీట్..**

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 ( నమస్తే తెలంగాణ ) : ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో అత్యద్భుతమైన మెట్ల బావుల ఫొటోలను షేర్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. 'ఒక ప్రాంతం యొక్క ఆత్మ.. ఆ ప్రాంత చరిత్ర, సంస్కృతి, వారసత్వంలో జీవించి ఉంటుంది. సమర్థవంతమైన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విలువైన వారసత్వ కట్టడాలను సంరక్షించడానికి, పునరుద్ధరించడానికి ఘణనీయమైన చర్యలు తీసుకుంది. అంతరించిపోతున్న ఐకానిక్ స్మారక చిహ్నాలకు కొత్త జీవాన్ని అందించింది. వందల ఏండ్ల నాటి వారసత్వ కట్టడాలను తెలంగాణకు గర్వకారణంగా నిలిపింది. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలు మన సంస్కృతి గొప్పతనాన్ని పెంచాయి' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# రజతోత్సవాలకు రారండోయ్..


*గ్రేటర్ గులాబీ శ్రేణుల్లో రజతోత్సవ సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ భారీ బహిరంగ సభకు శ్రేణులు సమాయత్తమవుతున్నారు. ఈ వేడుకను ప్రతి కార్యకర్త ఇంట్లో పండుగ వాతావరణంలో జరుపుకొనేలా భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 8న తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశంలో రజతోత్సవ సభ విజయవంతం చేసేలా దిశానిర్దేశం చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 3వేల మంది సభకు వెళ్లేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి బీఆర్ఎస్ పార్టీని స్థాపించి అనేక పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ గొప్ప పరిపాలనదక్షుడని ఈ సందర్భంగా సన్నాహక సమావేశంలో నేతలు చెబుతున్నారు. ఉద్యమ సారథియే తెలంగాణ మొదటి సీఎంగా ఉండటం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా జరిగిందని కొనియాడుతున్నారు. డివిజన్ల వారీగా చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణలు చేస్తూ 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక పండుగ తమ ఇంట్లో పండుగగా ప్రతి ఒక్క కార్యకర్త భావిస్తున్నట్టు పేర్కొంటున్నారు. గ్రేటర్‌లో కార్యకర్తలందరితో వరంగల్‌కు బయలుదేరడంపై సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా నేతలు వివరిస్తున్నారు.*

*– సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ):*

## నేడు గ్రేటర్ నేతలతో కేటీఆర్ సమావేశం

హాజరుకానున్న గ్రేటర్ పరిధిలోని ముఖ్యనేతలు

ప్రతి నియోజకవర్గం నుంచి 3వేల మంది వెళ్లేలా కార్యాచరణ



### 10.30 గంటలకు సమావేశం

తెలంగాణ భవన్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు గ్రేటర్ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశాన్ని నిర్వహిస్తారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. సభ విజయవంతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఇతర ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొంటారని తలసాని వివరించారు.

# కాంగ్రెస్‌పై ప్రజలకు విరక్తి

## సన్నాహక సమావేశాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి



మేడ్చల్, ఏప్రిల్18(నమస్తే తెలంగాణ): అన్నపూర్ణ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్‌లలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశాలను నిర్వహించారు. రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తి చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. ఇప్పుడు మళ్లీ కేసీఆర్, కేటీఆరే కావాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

**దేశంలోనే నంబర్ వన్‌గా..**

సీఎంగా కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉంచిన విషయాన్ని ఎమ్మెల్యే మల్లారెడ్డి గుర్తు చేశారు. ఈనెల 27న జరిగే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలు ఎదరు చూస్తున్నారన్నారు. సభకు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి

### పూర్వవైభవం తీసుకొద్దాం..

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 18: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో 27న నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ప్రతినాయకుడు, కార్యకర్త తరలిరావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి కోరారు. శుక్రవారం అత్తాపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం ప్రత్యేక కార్యచరణలు రూపొందించి ప్రణాళికతో ముందుకు సాగాలని గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకువచ్చి రానున్న ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేలా కష్టపడి పని చేయాలన్నారు.



రజతోత్సవ సభ పోస్టర్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి